అడ్డగోలు తవ్వకాలతో అవస్థలు

- ఇష్టానుసారంగా రోడ్ల తవ్వకాలు
- రాకపోకలకు ఇబ్బందులు
- ప్రమాదాల బారిన పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



తాగునీటి కనెక్షన్ కోసం తవ్వి అలాగే మట్టితో గోతిని పూడ్చివేసిన దృశ్యం

చార్మినార్: జీహెచ్ఎంసీ నుంచి కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా రోడ్లను తవ్వి వదిలేస్తున్నారు. పనులు పూర్తయిన వెంటనే ఆయా రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేయకుండా చేతులు దులుపుకుంటున్నారు. జలమండలి, టెలిఫోన్, టీఎస్ఎస్పీడీసీఎల్, జీహెచ్ఎంసీ తదితర ప్రభుత్వ విభాగాలతో పాటు ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో కేబుల్ పనుల కోసం రోడ్లను ఎక్కడిక్కడ తవ్వి వదిలేస్తున్నారు. తాగునీటి పైప్‌లైన్ అంటూ.. డ్రైనేజీ పైప్‌లైన్ అంటూ.. ఇలా అడ్డగోలుగా రోడ్లను తవ్వేస్తున్నారు. ఈ తవ్వకాల కోసం సంబంధిత జీహెచ్ఎంసీ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశలో ఎవరూ వెళ్లడం లేదు. రాత్రికి రాత్రి గోతులు తీసి తమ పని పూర్తి చేసుకుని.. అక్కడి మట్టితోనే తవ్విన గోతిని పూడ్చి వేస్తున్నారు. ఒక్కోసారి తాత్కాలిక మరమ్మతులు సైతం చేయడం లేదు. దీంతో నిత్యం రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా..

వ్యాపార, గృహనిర్మాణాలు చేపట్టే యజమానులు రోడ్డుకు అడ్డంగా గృహనిర్మాణ వస్తువులను డంప్ చేస్తున్నారు. ఇసుక, కంకర, ఇటుకలు రోడ్డును పూర్తిగా ఆక్రమిస్తుండడంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఒక్కోసారి చిన్నచిన్న ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. వాహనదారులు ఈ రోడ్లపై రాత్రిపూట రాకపోకలు సాగిస్తూ వాహనం అదుపుతప్పి గాయాల పాలవుతున్నారు. కొంత మంది కాంట్రాక్టర్లు సంబంధిత అధికారులతో చేతులు కలిపి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలుండడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటే స్థానిక ప్రజల సమస్యలు కొంత మేరకన్నా తీరుతాయి.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లు..

- కొన్ని చోట్ల అభివృద్ధి పనుల పేరుతో ఎక్కడికక్కడ రోడ్లు తవ్వేస్తున్న జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాలకు సంబంధిత కాంట్రాక్టర్లు ఆయా పనులను ప్రారంభించడానికి కాలయాపన చేస్తున్నారు.
- నత్తనడకన పనులను నిర్వహిస్తూ స్థానికులకు ఇబ్బందులు కలుగజేస్తున్నారు.
- జలమండలి ఆధ్వర్యంలో తాగునీటి కనెక్షన్ల కోసం రోడ్డును అడ్డంగా తవ్వి..పనుల అనంతరం శాశ్వత ప్రాతిపదికన రోడ్డును బాగు చేయడం లేదు.
- తాత్కాలిక మరమ్మతులు కూడా సక్రమంగా చేయకపోవడంతో ఆయా బస్తీల్లో సమస్యలు తలెత్తుతున్నాయి.
- అధ్వానంగా మారిన రోడ్లపై ఉన్నా కంకర, మట్టిని సైతం తొలగించడానికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అధికారులపై బస్తీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు, అధికారులు స్పందించి బస్తీలో మొదలుపెట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

పటేల్‌నగర్‌లో 'బస్తీబాట'



సమావేశమైన మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర తదితరులు

గౌలిపురా: బీజేపీ పార్టీ పిలుపు మేరకు ఆదివారం పటేల్‌నగర్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్ పటేల్ నగర్ బూత్ నంబర్ 41, 43, 50లో బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పాల్గొని పటేల్‌నగర్ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు శివానంద్, సాకెల్లి దేవదాస్, బస్తీ ప్రముఖులు, పోలింగ్ బూత్ కార్యకర్తలతో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క ఇంటికి కేంద్ర ప్రభుత్వ పథకం ఏదో ఒక పథకం అందే విధంగా స్థానిక బీజేపీ ముఖ్య నాయకులు, పోలింగ్ బూత్ స్థాయి కార్యవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు విశాల్, నరేశ్, కృష్ణ, విజయ్, డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, సాకెల్లి సర్వేశ్ కుమార్, డి.ప్రవీణ్ కుమార్, జి.వికాస్, పోలింగ్ బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సర్కారు చేయూతనివ్వాలి



క్రీడాకారులను సన్మానిస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకారం అందించాలని నగర గ్రంథాలయ మాజీ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నేషనల్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ కరాటే పోటీలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాతబస్తీలో క్రీడాకారులకు ఎంతో చేయూతనందించామన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. క్రీడారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు రాణిస్తారన్నారు.

బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



నిర్మల్‌కుమార్‌యాదవ్‌ను సత్కరిస్తున్న ఉదయ్ పహిల్వాన్ తదితరులు

అబిడ్స్: బడుగు బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే బీసీల ప్రగతి, సంక్షేమం జరుగుతుందన్నారు. ఓబీసీ సెల్ జాయింట్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన నిర్మల్‌కుమార్ యాదవ్‌ను ఉపరాస్ వ్యాయామశాల నిర్వాహకులు ఉదయ్ పహిల్వాన్, జయదీప్ యాదవ్, బజరంగ్ లాల్ యాదవ్‌తో పాటు పలువురు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలంతా ఐక్యమై కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్ యాదవ్, నర్సింగ్ యాదవ్, రఘునందన్ యాదవ్, అంగాద్‌యాదవ్, కిషన్‌లాల్ పహిల్వాన్, శంకర్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీని మరోసారి ప్రధానిని చేసేందుకు మహిళా శక్తి సిద్ధం



మహిళా మోర్చా సమావేశంలో పాల్గొన్న ఓంప్రకాష్, సురేఖ

అబిడ్స్: కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీని మరోసారి ప్రధానమంతి అయ్యేందుకు మహిళా శక్తి సిద్ధంగా ఉందని రాష్ట్ర బీజేపీ దళిత మోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్, గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ భీశ్వ సురేఖ పేర్కొన్నారు. గన్‌ఫౌండ్రీలో జరిగిన మహిళా మోర్చా సమావేశంలో వారు మాట్లాడుతూ..తెలంగాణలో హైదరాబాద్ పార్లమెంట్‌తో పాటు అన్ని పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మహిళలంతా ఏకమై బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేసి బీజేపీని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.

ఓబీసీల సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో చర్చిస్తున్న దీపేష్ రాజ్ వర్మ

చార్మినార్: రాష్ట్రంలోని ఓబీసీలను మజ్లిస్ పార్టీ వైపు ఆకర్షింపచేసేందుకు కృషి చేస్తున్నామని ఏఐఎంఐఎం ఓబీసీ విభాగం ఇన్‌చార్జి దీపేష్ రాజ్ వర్మ తెలిపారు. ఈ మేరకు దారుసలాంలోని కేంద్ర కార్యాలయంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి రాష్ట్రంలోని ఓబీసీల సమస్యలను ఆయనతో చర్చించి పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు పార్టీ అంశాలను చర్చించినట్లు దీపేష్ రాజ్ వర్మ తెలిపారు.

శుభాకాంక్షలు

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన వరంగల్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను టీపీసీసీ కార్యదర్శి కె.ఎస్.ఆనంద్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009 నుంచి 2014 వరకు ఎంపీగా పని చేసిన రాజయ్య తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారన్నారు.



రాజయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కె.ఎస్.ఆనంద్‌రావు

ఓంనగర్‌కాలనీకి బస్సు సౌకర్యం కల్పించండి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ: బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఓంనగర్ కాలనీ వాసులు ఆదివారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి అనేక మంది విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం నగరానికి వెళ్తుంటారని, ఉదయం, సాయంత్రం సమయంలో బస్సులు లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తుందన్నారు. అలాగే ఆటోలను ఆశ్రయిస్తే ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ గుండా మెహిదీపట్నం, సికింద్రాబాద్, కోటి తదితర ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. దీంతో పాటు రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని వారు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో చర్చించి ఓంనగర్ కాలనీ గుండా బస్సు సౌకర్యాన్ని కలిప్స్తామన్నారు. ప్రజా సమస్యలను సైతం అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోకరి సురేశ్‌గౌడ్, ఓంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నవీన్‌ముదిరాజ్, మల్లారెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

మణికొండ: వాసవీ క్లబ్ కపుల్స్, శ్రీతేజ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా మణికొండ వాసవీ క్లబ్ కపుల్స్ అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ పోషకాహారం తీసుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో



క్యాంప్‌లో పాల్గొన్న అలకాపూర్ టౌన్‌షిప్‌వాసులు

వాసవీ క్లబ్ కపుల్స్ కార్యదర్శి యశ్వంత్, కోశాధికారి నిరీష, జోన్ చైర్మన్ కె. నిరీష, రీజియన్ చైర్మన్ జి.నవీన్‌కుమార్, రీజియన్ కార్యదర్శి రామ్ సురేశ్, జిల్లా ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, డాక్టర్లు రంజిత్, హిరణ్మయి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రామామృతం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినేత్రి ఆర్ట్స్ అకాడమి, పరంపరల సంయుక్తాధ్వర్యంలో రామామృతం పేరిట ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన నృత్య విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు కళా ప్రముఖులు మాట్లాడుతూ..శాస్త్రీయ సంగీత కళలను నేటి యువతరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. త్యాగరాజ అన్నమయ్య కీర్తనలకు కళాకారుల నృత్యాలు కనువిందు చేశాయి. అంతా రామమయం పేరిట సాగిన పల్లకి సేవా అలరించింది. ఈ కార్యక్రమంలో పరంపర ప్రతినిధులు శౌరెడ్డి, కళాకృష్ణ అభినేత్రి ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకుడు ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వికాస ఉద్యమాలకు ఆద్యుడు భాగ్యరెడ్డి వర్మ

సుల్తాన్‌బజార్: దేశంలోని దక్కన్ పీఠభూమి కేంద్రంగా ఎన్నో సామాజిక సంస్కరణలు, ఉద్యమాలకు ఆద్యుడిగా భాగ్యరెడ్డి వర్మ నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం చాదర్‌ఘాట్‌లోని ఆది హిందూ భవన్‌లో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ స్మారకోపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్, భాగ్యరెడ్డి వర్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బాల నరసింహ తదితరులు హాజరై ప్రసంగించారు. చీకటి నుంచి వెలుగు పంచిన జ్ఞాన యోధుడిగా భాగ్యరెడ్డి వర్మను అభివర్ణించారు. ప్రథమ ఆంధ్ర మహాసభ, తెలంగాణ సాయుధ పోరాటం, నిజాం వ్యతిరేక ఉద్యమానికి భాగ్యరెడ్డి వర్మ మొదలుపెట్టిన ఆది హిందూ ఉద్యమమే పునాదిగా అభిప్రాయపడ్డారు. ఆర్య సమాజం, బ్రహ్మ సమాజంతో కలిసి పనిచేస్తూనే 1917లో విజయవాడలో జరిగిన పంచమం మహాసభకు వక్తగా వెళ్లి సమాజాన్ని చైతన్యవంతం చేసిన నేతగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అబిడ్స్: ఎంజేమార్కెట్‌లో గోషామహల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజలకు ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ప్రతిజ్ఞన చేశారు. అనంతరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

రంగనాథస్వామి పల్లకీసేవ

రాయదుర్గం: రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం ఆలయంలో బాలబోగం, అర్చన, బలిహరణ, ఆరాధన తదితర పూజలను నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవతో పాటు స్వామివారికి వాహనసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మైత్రి కమిటీ సభ్యుల సేవలు వెలకట్టలేనివి



సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న రాజువస్తాద్

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు పోలీసులకు అందిస్తున్న సహాయ సహకారాలు వెలకట్టలేనివని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనను గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ సీనియర్ ప్రతినిధి ఎస్.రాజువస్తాద్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. హైదరాబాద్ పోలీసులతో పీస్ అండ్ మైత్రి సభ్యుల అనుబంధం దశాబ్దాల నాటిదన్నారు. సైబర్ నేరాలు ఎన్నో రకాలుగా జరుగుతున్నాయని ప్రజలకు తాము సైబర్ క్రైమ్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆబేద్, అక్బర్, షానవాజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

మహా శివరాత్రి జాగరణ్ బ్రోచర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న మాడిశెట్టి సదానందం గుప్తా, ఎస్ఐలు సాయికృష్ణ, సుబ్రహ్మణ్యం

అబిడ్స్: మహా శివరాత్రి జాగరణ్ సేవా సమితి ఆధ్వర్యంలో మహా జాగరణ్ మహోత్సవ బ్రోచర్లను ఆవిష్కరించారు. రహింపురాలో జరిగిన కార్యక్రమంలో జాగరణ్ సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా, మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు సాయికృష్ణ, సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి రాజన్‌కుమార్, కోశాధికారి రాజేందర్ సింగ్, రంజిత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదానందం గుప్తా మాట్లాడుతూ..ఈ సంవత్సరం మహా శివరాత్రి జాగరణ్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ వర్మ, శైలేందర్ సింగ్, ప్రదీప్‌కుమార్, బాల్‌రాజ్ గౌడ్, పురుషోత్తమ్ సింగ్, శ్రవణ్‌కుమార్, సందీప్ బుక్కా, నరేష్ గుప్తా, నితిన్ రాజ్, నవీన్, నర్సింగ్‌రావు, గాపాల్‌సింగ్, ఓంఠాకూర్ పాల్గొన్నారు.

అధ్వానంగా గోల్కొండ వార్డు కార్యాలయం



వార్డు కార్యాలయం లోపల ఆటోలు



శిథిలావస్థలో వార్డు కార్యాలయం రెండో గేటు

గోల్కొండ: గోల్కొండ బల్దియా వార్డు కార్యాలయం అధ్వానంగా తయారయ్యింది. గోల్కొండ కోట ప్రధాన గేటుకు ఎదురుగా ఉన్న ఈ కార్యాలయ ప్రాంగణం ఆటోలు, ఆటో ట్రాలీలకు అడ్డాగా మారింది. దశాబ్దాల నాటి ఈ భవనం పైకప్పుకు ఉన్న రేకులు పెద్దగా గాలి వీస్తే ఎగిరిపోయే స్థితిలో ఉన్నాయి. గోల్కొండ కోట చౌరస్తా, ఫతే దర్వాజ మెయిన్ రోడ్డుపై ఉన్న ఈ కార్యాలయాన్ని బల్దియా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బల్దియా వార్డు కార్యాలయాలకు కొత్త రూపు ఇస్తున్నామంటూ భారీగా ప్రచారం చేశారు. అయితే గోల్కొండ వార్డు కార్యాలయానికి మాత్రం మెయిన్ గేటుపైన బోర్డు పెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. వార్డు కార్యాలయానికి ఉన్న రెండో గేటు శిథిలావస్థకు చేరుకుంది. వార్డు కార్యాలయం ప్రహరీ చుట్టూ వాహనాలు నిలిచి ఉంటాయి. బల్దియా అధికారులు కార్యాలయ పని వేళల్లో మాత్రమే పాటిస్తున్నారు తప్పా ప్రజలకు కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్న విషయాన్ని మరచిపోతున్నారు. ఇప్పటికైనా గోల్కొండ వార్డు కార్యాలయం బాగుపడుతుందని స్థానికులు ఆశిస్తున్నారు.

మ్యాన్‌హోళ్ల మూతలు మాయం



అసెంబ్లీ ఎదుట మ్యాన్‌హోళ్ల మూతలను ఎత్తుకెళ్లిన దృశ్యం

నాంపల్లి: అసెంబ్లీ ఎదుట గన్ పార్కులో మ్యాన్‌హోళ్ల మూతలు మాయమయ్యాయి. శనివారం సాయంత్రం శాసన సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అదేరోజు అర్ధరాత్రి 30 కేజీల బరువున్న మూడు ఇనుప మ్యాన్‌హోళ్ల మూతలను దొంగలు ఎత్తుకెళ్లారు. శనివారం సాయంత్రం వరకు ఉన్న మ్యాన్‌హోల్స్ ఆదివారం తెల్లవారు ఉదయాన్నే చూస్తే కనిపించడం లేదని గన్‌పార్కు సెక్యూరిటీ సూపర్‌వైజర్ ప్రవీణ్‌కుమార్ సైఫాబాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైట్‌నర్ సేవించిన వ్యక్తులే ఇలాంటి దురాగతానికి పాల్పడి ఉంటారని అక్కడి సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల కిందట కంట్రోల్ రూమ్ దగ్గర మ్యాన్‌హోళ్లను ఎత్తుకెళ్లారు. ఇప్పుడు మళ్లీ గన్‌పార్కు వద్ద మ్యాన్‌హోళ్ల మూతలను మాయం చేశారు. అసెంబ్లీ చుట్టూ సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ, వీటన్నింటిని లెక్క చేయకుండా తీసుకెళ్లడంపై అటు పోలీసులు, ఇటు వాటర్ వర్క్స్ అధికారులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా స్వామి దయానంద సరస్వతి జయంతి శోభాయాత్ర



నాంపల్లి: ఆర్య సమాజ్ స్థాపకులు మహర్షి స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను మహర్షి స్వామి దయానంద సరస్వతి జయంత్యుత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బషీర్‌బాగ్ నుంచి నాంపల్లి అసెంబ్లీ మీదుగా శోభాయాత్రను చేపట్టారు. ఈ శోభాయాత్రను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రారంభించారు. అనంతరం ఈ శోభాయాత్ర ఎల్బీస్టేడియం, పోలీస్ కంట్రోల్ రూమ్, పబ్లిక్‌గార్డెన్, గన్‌పార్కు, అసెంబ్లీ మీదుగా రవీంద్రభారతి వరకు కొనసాగింది. ప్రొఫెసర్ డాక్టర్ బి.జె.రావు, డాక్టర్ ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చారిత్రక నిర్ణయం



కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: కుల గణన సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న చారిత్రక నిర్ణయం అని సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కుల గణనపై తీర్మానం ప్రవేశపెట్టడం, ఆమోదించబడడం సీఎం రేవంత్‌రెడ్డి కార్యదర్శకతకు కుల గణనపై ప్రభుత్వం నిర్ణయాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆదివారం రింగ్ రోడ్డు వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణన వల్ల అణగారిన కులాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ



కరాటే బెల్టులు, ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు, ప్రిన్సిపాల్ సిస్టర్ ఆరోగ్యమేరి

విజయనగర్‌కాలనీ: విద్యార్థినులు ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాలని సెయింటాన్స్ బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఆరోగ్యమేరి దివ్య, కరాటే శిక్షకుడు జోరీగల శ్రీధర్ తెలిపారు. కరాటేలో శిక్షణ పొంది పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరాటే బెల్టులు, ధృవీకరణ పత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..విద్యాతో పాటు విద్యార్థినుల్లో స్వీయ రక్షణ పెంచేందుకు పాఠశాల ఆవరణలో కరాటే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ రోజీ ఫ్రాన్సిస్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం



రాజయ్యకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటేశ్

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన సిరిసిల్ల రాజయ్య, సభ్యుడిగా నియమితులైన సంకేపల్లి సుధీర్‌రెడ్డిను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ ఘనంగా సన్మానించారు. ఆదివారం ఎర్రమంజిల్‌లోని ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా సుధీర్ రెడ్డి పదవీ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారిని వెంకటేశ్ శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణంలో నర్సింగ్, రక్షిత్‌సాగర్ తదితరులు

గోల్కొండ: శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆదివారం గుడిమల్కాపూర్‌లోని మార్కడేయనగర్ తాళ్లగడ్డలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు డి.నర్సింగ్, రక్షిత్ సాగర్, రాహుల్, మణికంత్, నందకిషోర్ పాల్గొన్నారు.

ఎన్‌బీడీసీ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



నాంపల్లి: న్యూ బోయిగూడ 'డీ-క్లాస్'క్వార్టర్స్ డెవలప్‌మెంట్ కమిటీ (ఎన్‌బీడీసీ)కి కొత్త కార్యవర్గం ఎన్నికయ్యింది. ఆదివారం డీ-క్లాస్ క్వార్టర్స్‌లో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై.సునీల్‌కుమార్ (కన్నా), ప్రధాన కార్యదర్శిగా కె.వంశీ బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బి.శివ ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుంది. త్వరలోనే పూర్తి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని ఎన్నికల నిర్వాహకులు ఉమేష్‌కుమార్ తెలిపారు.

పాతబస్తీలో సందర్శకుల సందడి



చార్‌కమాన్-చార్మినార్ రోడ్డులో...

చార్మినార్: సాధారణ రోజుల్లోనే రద్దీగా కనిపించే చార్మినార్ పర్యాటక ప్రాంతాలు.. ఇక ఆదివారం కాలినడకకు కూడా జాగా కనిపించకుండా రోడ్లన్నీ సందర్శకులతో కిటకిటలాడాయి. పర్యాటకుల రద్దీ పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ వద్ద యధావిధిగా ట్రాఫిక్ జాం తప్పలేదు. చార్మినార్‌తో పాటు గుల్జార్‌హౌజ్, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, జూ పార్కు, నిజాం మ్యూజియం, మక్కా మసీదు తదితర ప్రాంతాలన్నీ సందర్శకులతో నిండిపోయాయి. ఆదివారం ఆయా పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులు సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందర్శకులతో కళకళలాడాయి.